క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



తట్టెపల్లి పరిసరాలను పరిశీలిస్తున్న డీపీఓ, డీఎల్‌పీఓ

పెద్దేముల్: నాలుగు రోజులుగా పెద్దేముల్ మండలం తట్టెపల్లి వాసులు రోగాల బారిన పడి, ఆస్పత్రుల పాలవుతున్న నేపథ్యంలో బుధవారం డీపీఓ తరుణ్, డీయల్‌పీఓ శంకర్‌నాయక్, ఎంపీడీఓ లక్ష్మప్పలు గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గ్రామస్తులను వివరాలు అడగగా.. అపరిశుభ్రత కారణంగానే రోగాల పాలవుతున్నామని పలువురు చెప్పారు. అనంతరం అధికారులు మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, వృథా నీరు నిలువ ఉండకుండా చూడాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి ఎంపిడీఓ సూచించారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ పనులు సక్రమంగా సాగేలా చూడాలని ఆదేశించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు అండగా 'భవిత'



విద్యార్థులకు యంత్రాలను అందజేస్తున్న ఎంపీపీ

పరిగి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చుతుందని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. పట్టణ కేంద్రంలోని భవిత కేంద్రంలో బుధవారం వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు వినికిడి శక్తిని ఇచ్చే యంత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత కేంద్రంలో ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారని చెప్పారు. తద్వారా విద్యార్థుల్లో మార్పులు వస్తున్నాయన్నారు. పిల్లలను వారి తల్లిదండ్రులు ఇక్కడికి తీసుకువచ్చి శిక్షణ పొందాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరిస్తామని, వాటిని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇందులో మండల విద్యాధికారి హరిశ్చందర్‌నాయక్, ఉపాధ్యాయులు జ్యోతి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి

కొడంగల్ రూరల్: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడంతో బిడ్డ ఎదుగుదలతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. బుధవారం మండల పరిధి పలుగురాళ్ల తండాలో జాతీయ పోషణ మాసంను పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పౌష్టికాహార విలువను వివరించారు. ఆకు కూరలు, పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పండ్లు, చిరుధాన్యాలు తీసకోవాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతను, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దీప, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, చంద్రకళ, ఆయాలు మంగమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన చాపల నర్సయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి బుధవారం తన కుమారుడు, కాంగ్రెస్ యువనేత రితిక్ రెడ్డి, స్థానిక మండల నాయకులతో బాధిత కుటుంబీకులకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, భాస్కర్, వెంకటేశ్ ఉన్నారు.

రోడ్డు భద్రతపై కళాజాత

పెద్దేముల్: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కాశీనాథ్ అన్నారు. మంగళవారం రాత్రి పెద్దేముల్ మండలం బండమీదిపల్లి గ్రామంలో కళాజాత బృందంతో సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. మూఢ నమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, బాల్య వివాహాలు తదితర వాటిపై అవగాహన కల్పించామని చెప్పారు.

న్యాయం చేయండి..

అనంతగిరి: మొమిన్‌పేట మండలంలో ఇటీవల ప్రభుత్వం చేపట్టిన భూసేకరణలో తమకు అన్యాయం జరిగిందని పలువురు బాధిత రైతులు బుధవారం వికారాబాద్ ఆర్డీఓకు విన్నవించారు. ప్రభుత్వం తమ వద్ద భూమి తీసుకుందని, కానీ పరిహారం సరిగా ఇవ్వలేదని ఆరోపించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు కల్పించుకొని తమకు పూర్తిస్థాయిలో పరిహారం అందేలా చూడాలన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

- ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వం
- రాబోయేది కాంగ్రెస్ సర్కారే
- కార్యకర్తల సమావేశంలో హస్తం నేతలు



దోమ: పార్టీలో చేరిన కార్యకర్తలతో నాయకులు

దోమ: రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, పరిగి మాజీ ఎమ్మెల్యే తనయుడు రితిక్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. బుధవారం దోమ మండలం బాస్‌పల్లి, దొంగఎన్కేపల్లి గ్రామాల్లో వివిధ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు ప్రజలకు నచ్చకనే కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో పేద ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, దొంగ ఎన్కేపల్లి సర్పంచ్ అశోక్‌రెడ్డి, బాస్‌పల్లి మాజీ సర్పంచ్ అనంతయ్య, సుల్తాన్‌పూర్ సర్పంచ్ వెంకట్‌రాంరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు

పెద్దేముల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ కమిటీ, బూత్‌కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ అన్నారు. పెద్దేముల్ మండలం తట్టెపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా బాబు హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా రాములు, కార్యదర్శి రాములు నాయక్‌లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నాయక్, ఉప సర్పంచ్ కిష్టప్ప, డైరెక్టర్ అంజప్ప, మాజీ డైరెక్టర్ రాము పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే..

తాండూరు రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప అన్నారు. ఈ మేరకు కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే.. అధికారంలోకి వస్తామన్నారు. తాండూరులో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, బోయ అశోక్ కుమార్, జగదీశ్, జర్నప్ప పాల్గొన్నారు. గ్రామాల్లో నూతన కమిటీని నియమించి, వారిని సన్మానించారు.

పాలన నచ్చకే కాంగ్రెస్‌లోకి వలసలు

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: ప్రభుత్వ పాలనపై విసుగు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధి సిరిపురం గ్రామానికి చెందిన పలువురు అధికార పార్టీ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి

ఉరికితే దొరకవు.. దొరికితే కదలవు!





బస్సు ఎక్కడానికి వచ్చిన ప్రయాణికులు (ఇన్‌సెట్‌లో) మొరాయించిన బస్సును తోస్తున్న విద్యార్థులు

ధారూరు: 'ఆర్టీసీ బస్సులకు అసలే సమయ పాలన ఉండదు. ఆపై కాలం చెల్లిన సర్వీసులు. ఉరికితే దొరకవు. దొరికితే ఉరకవు' అని పలువురు ప్రయాణికులు వాపోయారు. బుధవారం ధారూరు నుంచి తాండూర్‌కు వెళ్లడానికి సమయానికి వచ్చిన బస్సును గబగబా ఎక్కిన ప్రయాణికులకు చుక్కలు కనపడ్డాయి. అందరూ ఎక్కి కూర్చున్నాక తీరా ఆ సర్వీసు సాంకేతిక లోపంతో ముందుకు కదలనని మొరాయించింది. దీంతో అందరూ దిగి తలో చెయ్యేస్తే కానీ దాంట్లో కదలిక రాలేదు. అనంతరం బస్సెక్కిన పలువురు విద్యార్థులు మాట్లాడారు. వేరే బస్సు లేక.. ఉన్నది ఎక్కితే బస్సు కస్సుబుస్సు మందని, కళాశాలకు వెళ్లేసరికి ఓ తరగతి మిస్సవుతామని విచారం వ్యక్తం చేశారు.

కళ్లకు గంతలతో ఉద్యోగుల నిరసన

బొంరాస్‌పేట: ఉద్యోగ భద్రత, వేతనాల గురించి ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె తీవ్రంగా మారుతోంది. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమానికి బొంరాస్‌పేట, దుద్యాల మండలాలకు చెందిన ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టి నిరసన వ్యక్తంచేశారు. మహిళా ఉద్యోగులు వంటావార్పు చేశారు. సమస్యలు తీర్చాలని సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న డిమాండ్ న్యాయమైనదేనని, ప్రభుత్వం స్పందించి వాటిని తీర్చాలని సీఆర్‌పీలు నర్సింహులు, శ్రీనివాస్ కోరారు.



నిరసనలో ఉద్యోగుల వంటావార్పు

పారిశుద్ధ్య కార్మికులతోనే స్వచ్ఛత



మర్పల్లి: జీపీ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ ఇందిర, అశోక్ తదితరులు

- స్వచ్ఛత హీ సేవను విజయవంతం చేయండి: ప్రజాప్రతినిధులు

మర్పల్లి: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని పారిశుద్ధ్య కార్మికులు విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అశోక్ కోరారు. బుధవారం మండల పరిధి పట్లూర్ గ్రామంలో స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని సర్పంచ్ ఇందిరతో కలిసి జీపీ కార్మికులు, సిబ్బందిని సన్మానించారు. సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల కృషితోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయని చెప్పారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పట్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంపై వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహీజ్, పంచాయతీ కార్యదర్శి సంతోష, వార్డు సభ్యులు, పారిశుద్ధ కార్మికులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో వారిసేవ ఎనలేనిది

మోమిన్‌పేట: పారిశుద్ధ్య కార్మికులను సన్మానించడం గర్వంగా ఉందని సర్పంచ్ అంతమ్మ అన్నారు. బుధవారం మండల పరిధి ఎన్కేపల్లి జీపీ కార్మికులను స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సన్మానించి మాట్లాడారు. గ్రామంలో చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు తడి, పొడి చెత్తను వేరుచేస్తున్నారని, పల్లె స్వచ్ఛతలో వారి పాత్ర ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ ఆడివిరెడ్డి ఉన్నారు.



మోమిన్‌పేట: పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ అంతమ్మ

కార్మికుల సేవలతోనే..

దౌల్తాబాద్: స్వచ్ఛత భారత్ మిషన్‌లో భాగంగా గ్రామీణ స్వచ్ఛత హీ సేవా (ఎస్‌హెచ్‌ఎస్)లో మండల కేంద్రం పంచాయతీ కార్యాలయ ఆవరణలో జీపీ కార్మికులను సన్మానించారు. సర్పంచ్ శిరీష ఆధ్వర్యంలో వార్డు సభ్యులు కార్మికులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్మికుల సేవలతోనే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి గోపాల్, ఎంపీటీసీ శివమ్మ, శంకర్, వార్డు సభ్యులు సాయిలు, లక్ష్మప్ప, శివలీల పాల్గొన్నారు.

వెలకట్టలేనిది

కుల్కచర్ల: గ్రామాన్ని స్వచ్ఛగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కుల్కచర్ల గ్రామపంచాయతీలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాన్ని పురస్కరించుకుని పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, వార్డు సభ్యుడు మైపాల్, కారోబార్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన 'డిజిటల్'

- మూడు నెలలకే మూలన పడ్డ పరికరాలు
- నిర్వహణలో చిత్తశుద్ధి లోపం

వికారాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డిజిటల్ తరగతుల బోధన జిల్లాలో మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్రభుత్వ ఉదాసీనతతో ప్రస్తుతం ఇవి కొనసాగడంలేదు. 2015–16లో అన్ని ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం డిజిటల్ పరికరాలు పంపిణీ చేసింది. ఇవి ఏడాది తిరగక ముందే పాడయ్యాయి. 2017– 18లో అధికారికంగా పాఠశాల బోధనకు ఓ విధానం రూపొందించారు. అయితే గతంలో ఇచ్చిన కంప్యూటర్ల సామర్థ్యం తక్కువగా ఉండటం.. తర్వాత డిజిటల్ తరగతులకోసం ఇచ్చిన మోడం సామర్థ్యం ఎక్కువగా ఉండటంతో డిజిటల్ బోధన సాధ్యం కావటంలేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అయితే గత ఆరు నెలల క్రితం పాఠశాలలను డిజిటలైజేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రకటన చేసి కూడా ఆరు నెలలు దాటగా ఇంకా ప్రక్రియ ప్రారంభించలేదు. జిల్లాలో ఇప్పటికే అన్ని ఉన్నత పాఠశాలలకు డిజిటల్ పరికరాలు సరఫరా చేసినందున వాటిని మూలకు పడేస్తారా.. లేక వినియోగంలోకి తెస్తారా..? వేచి చూడాల్సిందే.

112 పాఠశాలల్లో

డిజిటల్ పరికరాల్లో నెలకొన్న చిన్నచిన్న సమస్యలను పరిష్కరించిన అనంతరం 2018లో మళ్లీ తరగతులు ప్రారంభించారు. జెడ్పీహెచ్‌ఎస్‌లు, కస్తూర్బా పాఠశాలలు, రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లు కలిపి 185 పాఠశాలలు ఉండగా.. 78 జెడ్పీహెచ్‌ఎస్‌లు, 17 కేజీబీవీలు, 9 మోడల్ స్కూళ్లు, 8 రెసిడెన్షియల్ స్కూళ్లను కలుపుకొని మొత్తం 112 ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ప్రారంభించారు. మరో ఆరు నెలల తర్వాత మిగిలిన స్కూళ్లలో కూడా డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టారు. ఇందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు నాలుగేళ్ల క్రితమే డిజిటల్ బోధనా పరికరాలు సరఫరా చేయగా.. కస్తూర్బాలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మరుసటి ఏడాది నూతన డిజిటల్ పరికరాలు సరఫరా చేశారు. దీంతో అన్ని స్కూళ్లలో డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చినట్లయింది. కానీ మూడు నెలలు తిరగక ముందే ఈ తరహా బోధనకు మంగళం పాడారు.



డిజిటల్ పాఠం వింటున్న విద్యార్థులు (ఫైల్)

పర్యవేక్షణ గాలికి..

2018– 19 విద్యాసంవత్సరంలో వంద శాతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు డిజిటల్ పరికరాలు సరఫరా చేశారు. దీంతో ఈ విధానంలో బోధన ప్రారంభమైంది. డిజిటల్ క్లాసుల ద్వారా విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమయ్యేవి. కానీ ఆతర్వాత కొద్ది రోజులకే ఈ పద్ధతికి ఫుల్‌స్టాప్ పెట్టేశారు. ఫలితంగా ప్రొజెక్టర్, స్క్రీన్ తదితర పరికరాలన్నీ మూలన పడ్డాయి. డిజిటల్ క్లాసుల నిర్వహణను పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆటల్లో రాణిస్తే.. భవిష్యత్తు బంగారు మయం

మోమిన్‌పేట: విద్యార్థులు క్రీడల్లో రాణించడం వలన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు రమేశ్ అన్నారు. మండల పరిధి చంద్రాయన్‌పల్లి పాఠశాల నుంచి పల్లవి అనే విద్యార్థినికి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ పాఠశాలలో నాలుగో తరగతిలో ప్రవేశం లభించడంతో బుధవారం పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి చదువుతో పాటు క్రీడలపై మక్కువ చూపాలని సూచించారు. ఏదైనా ఒక క్రీడలో ప్రావీణ్యం సాధిస్తే భవిష్యత్తు బంగారు మయం అవుతుందన్నారు. కావున విద్యార్థులు క్రీడలను ఎంచుకొని ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. పల్లవికి క్రీడా పాఠశాలలో ప్రవేశం లభించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళ్యాన్‌కుమార్, కార్యదర్శి వీణ తదితరులు ఉన్నారు.

ఆలయంలో అన్నదానం

ధారూరు: హనుమాన్ దేవాలయంలో బుధవారం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ చంద్రమౌళి ప్రారంభించారు. శుక్రవారం నిర్వహించే వినాయ నిమజ్జనం సందర్భంగా బస్టాండు వద్ద ప్రతిష్ఠించిన గణేశ్ మండపం వద్ద అన్నదానం చేశారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

- ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి
- డీజేలకు అనుమతి లేదు
- పీస్ కమిటీ సమావేశంలో పోలీసులు

దోమ: ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్ఐ రవిగౌడ్ సూచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో సర్పంచులు, ఎంపీటీసీలు, మండపాల నిర్వాహకులతో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద నిర్వాహకులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, బొంపల్లి ఎంపీటీసీ రాములు, ఏఎస్ఐ చారి, కానిస్టేబుల్ రెడ్యా తదితరులు పాల్గొన్నారు.

మనోభావాలను దెబ్బతీయొద్దు

పరిగి: గణేశ్ మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ వెంకటరామయ్య అన్నారు. పట్టణ కేంద్రంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని, మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఉత్సవ సమయంలో ఎవరి మనోభావాలను దెబ్బతీయకుండా చూసుకోవాలని సూచించారు. ఎస్ఐ సత్యనారాయణ, తహసీల్దార్ దానయ్య, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరిగి: మాట్లాడుతున్న సీఐ వెంకటరామయ్య

భక్తి శ్రద్ధలతో..

అనంతగిరి: చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని వికారాబాద్ డీఎస్పీ నర్సింహులు అన్నారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిమజ్జనానికి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, డీజేలకు అనుమతి లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, టౌన్ సీఐ శ్రీను, పలువురు ప్రతినిధులు ఉన్నారు.

మహిళలు భాగస్వామ్యం కావాలి

ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య



మహిళా సంఘం సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మర్పల్లి: ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వరకు ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేయాలని ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘం సభ్యులకు చెప్పారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో మండల మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ఇంటింటికీ ఇంకుడు గుంతలు ఉండాలని, తడి,పొడి చెత్తను వేరు చేసి ఇంటి ముందుకు వచ్చే ట్రాక్టర్‌లో వేయాలని చెప్పారు. విధిగా మరుగుదొడ్లను వాడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం సీనియర్, జూనియర్ సహాయకులు కృష్ణరావు, మల్లికార్జున్, ఎంపీఓ మహేశ్‌కుమార్, ఏపీఎం పోచయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, ఈసీ విఠల్, టీఏ భాస్కర్, విష్ణువర్ధన్‌రెడ్డి, మండల మహిళ సంఘం అధ్యక్షురాలు జగదాంబ, కార్యవర్గం, ఐకేపీ సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.



తాండూర్ టౌన్: తాండూర్ పట్టణం శాంతినగర్ వినాయకుని పూజలో కాలనీ వాసులు

ఆర్భాటమే.. ఆచరణ కరువు

- పడకేసిన 'ఇండియన్ లాంగెస్ట్ రన్'
- అమలుకాని స్కై ఫ్రం మెడిసిన్ ట్రాన్స్‌పోర్ట్



ఆకాశంలో మందులు తీసుకొస్తున్న డ్రోన్ (ఫైల్)

కొడంగల్: స్కై ఫ్రం మెడిసన్ పేరుతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఔషధాల రవాణా అటకెక్కింది. వికారాబాద్ జిల్లా పరిధి అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు డ్రోన్ సహాయంతో ఆకాశ మార్గంలో మందులను రవాణా చేయాలనే ఉద్దేశంతో రెండేళ్ల క్రితం స్కై ఫ్రం మెడిసన్‌ను ప్రారంభించారు. నిర్దిష్ట నియమాలు, ప్రభుత్వ సహకారం లేకపోవడం వలన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో హట్టహాసంగా ప్రారంభించిన మందుల రవాణాను అమలు చేయడం లేదనే అపవాదు ఉంది.

ట్రయల్ రన్‌కే పరిమితం!

జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి నుంచి కొడంగల్ సివిల్ హాస్పిటల్‌కు డ్రోన్ సహాయంతో ఆకాశ మార్గంలో రెండేళ్ల క్రితం మందులను సరఫరా చేశారు. స్కై ఫ్రం మెడిసిన్ పేరుతో వినూత్న పథకానికి రూపకల్పన చేశారు. వికారాబాద్ నుంచి కొడంగల్‌కు ఆకాశ మార్గంలో 42 కిలో మీటర్ల దూరం డ్రోన్ సాయంతో 40 నిమిషాల్లో మందులను చేరవేశారు. అత్యవసర పరిస్థితుల్లో మందులను రవాణా చేయడానికి అవకాశం ఉంటుందని వైద్యాధికారులు ప్రకటించారు. అప్పట్లో మారుట్ డ్రోన్స్ ప్రతినిధులు ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం మారుట్ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. విపత్కర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం దీనికి రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఏక ధాటిగా ఆకాశంలో 42 కిలోమీటర్లు ప్రయాణం చేసి మెడిసిన్ సరఫరా చేయడం దేశంలో ఇదే మొదటిసారని పేర్కొన్నారు. ఇండియన్ లాంగెస్ట్ రన్‌గా ప్రకటించారు. భవిష్యత్తులో జిల్లా కేంద్రం నుంచి అన్ని మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు మందులను సరఫరా చేస్తామని పేర్కొన్నారు. అయితే నాటి నుంచి నేటి వరకు ఒక్కసారి కూడా డ్రోన్ ద్వారా మందుల సరఫరా జరగలేదు. ఈ విషయంపై స్థానిక వైద్యాధికారులను వివరణ కోరగా తమకు తెలియదని చెప్పటం గమనార్హం.